క్లుప్తంగా

రాజీవ్ యువ వికాస్ రుణాలు విడుదల చేయాలి

చంపల్‌గూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ రుణాలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కుర్మగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 2న అర్హులకు రుణాలు అందిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాటా తప్పారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ప్రజలు సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూసారన్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి


మహేశ్‌గౌడ్

హస్తినాపురం: సైబర్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు కొత్తకొత్త స్కీంల పేర్లతో ప్రజలను ఆకర్షించేందుకు వాట్సాప్ గ్రూపులలో లింకులు పంపించి డబ్బులు దోచుకుంటున్నారని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచితంగా డబ్బులు వస్తాయని సైబర్ నేరగాళ్లు ఎరవేసి బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు మొత్తాని స్వాహా చేసే ప్రమాదం ఉందని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

గడువు పొడిగింపుపై హర్షం

చాదర్‌ఘాట్: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న సహాయ పరికరాల దరఖాస్తు గడువును జూన్ 27 వరకు పొడిగించటంపై వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..తమ సంస్థ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. గతంలో జూన్ 18 వరకే గడువు ఉండటంతో అనేక మంది ఇబ్బందులు పడ్డారని గడువు పెంచాలని తాము ఉన్నతాధికారులు, జిల్లా స్థాయిలో కలెక్టర్లకు వినతులు ఇచ్చామన్నారు. చివరికి వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడంతో ప్రభుత్వం స్పందించి గడువు పెంచిందన్నారు. గడువు పెంపునకు కృషి చేసిన టీవీసీసీ చైర్మన్ వీరయ్య, సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజకు కృతజ్ఞతలు అన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు వరమ్మ, కె.వెంకట్, యం.అడివయ్య, ఆర్.వెంకటేష్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న మురారి

చాదర్‌ఘాట్: రానున్న బోనాల పండుగను పురస్కరించుకొని రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఊరుకొనేది లేదని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి హెచ్చరించారు. బోనాల పండుగల సందర్భంగా రౌడీషీటర్లను బైండోవర్ చేసిన అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాదాల జోలికి వెళ్లొదని ప్రశాంతంగా ఉండాలని అనుమానాస్పదంగా తిరిగితే చర్యలు తప్పవన్నారు.

ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్ కాలనీలోని ఫ్రీడం పార్కులో మంజూరైన ఓపెన్ జిమ్ ఏర్పాటు స్థలాన్ని బుధవారం ఇంజినీరింగ్ అధికారి రాజ్‌కుమార్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. జిమ్‌కు కావాల్సిన అన్ని పరికాలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంచనాలు తయారు చేసి త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరావు, పాల్గొన్నారు,

కార్యవర్గం ఎన్నిక


గంగని శ్రీనివాస్

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు డివిజన్ కార్పొరేటర్ తెలిపారు. అధ్యక్షుడిగా గంగని శ్రీను, ఉపాధ్యక్షులుగా వస్పరి వెంకటేష్, మర్రి మధుసూదన్‌రెడ్డి, దేవరపల్లి సురేష్‌రెడ్డి, ఇట్టబోయిన నర్సింహముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా ఎర్రవెల్లి సత్యనారాయణ, నల్లనగుల గోవిందాచారి, కార్యదర్శులుగా సుజాత రెడ్డి, నడిగొట్టు లక్ష్మీదాస్, సైదమ్మ, విష్ణుచారి కోశాధికారిగా బొడ్డపల్లి జనార్ధన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రవిందర్‌రెడ్డి, బండారి భాస్కర్, ఉగాది ఎల్లప్ప పాల్గొన్నారు.

ఇళ్ల ముందు ఇలా..

అడుగు వేసేదెలా?

- నాగోలు గ్రామంలో సీసీ రోడ్ల కోసం తవ్వి వదిలేసిన దృశ్యం
- అర్ధంతరంగా పనులతో రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


నాగోలు గ్రామంలో నూతన సీసీ రోడ్డుకు కోసం తవ్వి వదిలేసిన పాత రోడ్డు

నాగోలు: నాగోలు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రోడ్లు తవ్వి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో పాత సీసీ రోడ్డు తవ్వి ఆ మట్టిని పూర్తిగా తొలగించకుండా అర్ధంతరంగా వదిలేయడంతో గ్రామస్తులు ఇళ్ల లోంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. సీసీ రోడ్డు కోసం తవ్విన రోడ్లను సకాలంలో పూర్తి చేయకపోవడంతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద ఎత్తున్న కంకర తెలిన రోడ్డు, గుంతలతో స్థానికులు ప్రమాదాలు జరగుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్ల పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేడయంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేసే కాంట్రాక్టర్‌కు చెందిన లారీలు, ఇతర వాహనలు ఆర్టీఏ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. రోడ్డు వేసే క్రమంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు సరిచేయకుండా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని దీంతో కాలనీలో ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి మురుగంతా బయటకు వచ్చి దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో పారుతున్న మురుగు


ఇళ్ల ఎదుట తవ్వి వదిలేశారిలా..

మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలి


ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ కమర్షియల్ టాక్స్ కాలనీల్లో ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు వెంటనే మరమ్మతు చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసం కావడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ డ్రైనేజీ మురికి నీరు వస్తున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా బుధవారం ఆయన సమస్యను పరిశీలించి వెంటనే మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలి


మాట్లాడుతున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశ పెడుతున్న పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం యాకత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్‌లో డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షుడు నగారిగారి దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా వారి సమస్యల పరిష్కారానికి పాటు పడాలన్నారు. కాంగ్రెస్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేసే నాయకులు, కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని అన్నారు. చాలా కాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు త్వరలోనే నామినేటెడ్, పార్టీ పదవులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రవి రాజు, లక్ష్మణ్, కోట్ల లడ్డూపటేల్, దేవి, సరోజ, వెంకటమ్మ, అలివేలు, కృష్ణవేణి పాల్గొన్నారు.

మద్యం మత్తులో విద్యుత్ తీగలు పట్టుకున్న వ్యక్తికి గాయాలు


వీరయ్యను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

చైతన్యపురి: మద్యం మత్తులో విద్యుత్ తీగలు పట్టుకున్న వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. మలక్‌పేట ముసారంబాగ్‌కు చెందిన దినసరి కూలీ వీరయ్య బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎంజి లిక్కర్ మార్ట్‌కు వచ్చి మొదటి అంతస్తులోని సిట్టింగ్ రూమ్‌లో కూర్చుని మద్యం తాగాడు. మద్యం మత్తులో అక్కడే ఉన్న కొందరితో గొడవ పడ్డాడు. అనంతరం ఆవేశంగా బాల్కనీలోకి వెళ్లి బిల్డింగ్‌కు ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పైకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా షాక్ తగలటంతో అక్కడే పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా గాయపడిన వీరయ్యను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి



సైదాబాద్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ సహకరించాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీఎస్ న్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య కోరారు. బుధవారం సైదాబాద్‌లోని జువైనల్ హోం బాలలకు మాదక ద్రవ్యాలకు నో చెప్పండి అనే సందేశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే తలెత్తే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ అభిషేక్ మహంతి, టీఎస్ న్యాబ్ అధికారి చెన్నూరి రూపేష్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, జువైనల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్ పాల్గొన్నారు.



అభినందన

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను బుధవారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా కలిసి అభినందనలు తెలిపారు. శ్రీనివాస్‌గుప్తా భవిష్యత్‌లో మరిన్ని పదవులు ఆశించాలని ఈ సందర్భంగా దయానంద్ గుప్తా కోరారు. – నాగోలు

అధిక ఎత్తులో స్పీడ్ బ్రేకర్లు.. ఇబ్బందుల్లో వాహనదారులు



వనస్థలిపురం: కాలనీల్లోని అంతర్గత రోడ్లలో పలువురు వాహనాలను వేగంగా నడిపిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతాయని కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో పలుచోట్ల స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం చేపట్టారు. అయితే ఒక నిర్దిష్ట ప్రమాణం లేకుండా అధిక ఎత్తులో ఉండటంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నారు. స్కూటర్లు, చిన్న కార్లకు స్పీడ్ బ్రేకర్లు తగులుతుండటంతో ధ్వంసమవుతున్నాయని ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి


నియామక పత్రం అందుకుంటున్న జగన్

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జిగా చంపాపేటకు చెందిన మంత్రి జగన్ నియమితులయ్యారు. జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు పల్లాటి రాములు నియామక ఉత్తర్వులు జారీ చేసి బుధవారం చంపాపేటలో జరిగిన సమావేశంలో జగన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ..కార్యకర్తలు, అభిమానుల సహాయ సహకారాలతో బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో పదవిలో నియమించినందుకు అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవికుమార్, రాములు పాల్గొన్నారు.

నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులతో ఆస్మా అంజుమ్

చంపాపేట: నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చంపాపేట ప్రభుత్వ యునానీ వైద్య శాల మెడికల్ అఫీసర్ డాక్టర్ ఆస్మా అంజుమ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ పేరిట డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆస్మా అంజుమ్ మాట్లాడుతూ.. గత నెల 27 నుంచి హరిత యోగా, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, మహిళలు, యువకులకు యోగా ప్రయోజనాలు తెలిపారు. యోగాతో మానసిక ఆందోళనలు, దీర్ఘకాలిక రోగాలు దూరమవుతాయన్నారు. అనంతరం రక్తహీనత కలిగిన విద్యార్థులు తీసుకోవాల్సిన న్యూట్రిషన్ ఫుడ్, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ భీమయ్య, సచిత, యునానీ ఫార్మాసిస్ట్ హేమరాణి పాల్గొన్నారు.

నేడు శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెట్ లెక్కల కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధి వివేకానందనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివేకానందనగర్‌కలానీలో డ్రైనేజీ, మంచినీరు, సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రతి నిత్యం కాలనీలోని రోడ్లపై మురుగునీరు ఏరులై పారుతుందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలికవసతులు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డివి వెన్నుపోటు రాజకీయాలు

- మధుయాష్కి గౌడ్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డివి వెన్నుపోటు రాజకీయాలని గత ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన 118 జీవో ఓ లొట్టపీస్ జీవో అని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కిగౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని 118జీవో బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుధీర్‌రెడ్డి రక్తంలోనే మోసం ఉందని జీవో 118 పేరుమీద ఇంక ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన తెచ్చిన జీవో తప్పుడు తడకగా ఉందని దీంతో ఇబ్బందులు ఉన్నాయని కాలనీ వాసులు పేర్కొంటుండగా ఇంకా అదే జీవో 118 ద్వారా కన్వీనియన్స్ డీడ్‌లు ఇప్పిస్తానంటూ మోసం మాటలతో మాయ చేస్తున్నాడని విమర్శించారు. 2004 నుంచి హుడా చైర్మన్‌గా, 2009, 2018లో ఎమ్మెల్యేగా ఉన్నా ఎందుకు సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాలనీ సంఘాల నాయకులు దామోదర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతనాయక్, నాయకులు గణేష్‌రెడ్డి,మకుటం సదాశివుడు, వినయ్‌పటేల్ పాల్గొన్నారు.

త్వరలో వెకెట్‌ల్యాండ్ టాక్స్ తొలగింపు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు ఇళ్లకు విధిస్తున్న వెకెట్ ల్యాండ్ పన్నును వారం రోజుల్లో తొలగిస్తామని, ఇందుకు సంబంధిన ఉత్తర్వులను త్వరలోనే జారీ చేస్తామని గ్రేటర్ కమిషనర్ పేర్కొన్నారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. 118జీవో బాధితుల ఇళ్లతో పాటు వెకెట్‌ల్యాండ్ టాక్స్‌ను విధిస్తున్నారని పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు ఫిర్యాదు చేయడంతో బుధవారం గ్రేటర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను ఆయన మల్‌రెడ్డి రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు కలిసి విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న మధుయాష్కిగౌడ్

కొత్త కార్డులకు కోటా లేదు

చాదర్‌ఘాట్: కొత్త రేషన్ కార్డుదారులకు కోటా విడుదల కాలేదని మలక్‌పేట సర్కిల్–1 ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పాత కార్డుల వారికే కోటా విడుదల అయిందని, కొత్త కార్డుల వారికి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులకు శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని యశోదనగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, రవిందర్‌గౌడ్, రఘురాం, రామకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, లింగంగౌడ్, విఠలేశం, వెంకటేష్, చంద్రమోహన్ రెడ్డి, రాములు, ప్రకాష్‌రావు, కొండల్‌రెడ్డి, సత్యనాయక్, శేఖర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.40, దొండ రూ.18.

మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి


వాహన తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

చైతన్యపురి: శాంతిభద్రతలు కాపాడేందుకు నిత్యం వాహనతనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. బుదవారం సాయంత్రం సరూర్‌నగర్ మండల కార్యాలయం, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేశారు. త్రిబుల్ రైడింగ్, నంబర్‌ప్లేట్ సరిగాలేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విజిబుల్ పోలీస్‌లో భాగంగా వాహనాలు తనిఖీలు చేయటంతో గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టవచ్చన్నారు.